క్లుప్తంగా

అక్క దేవతలకు పూజలు



అక్క దేవతలకు హారతి ఇస్తున్న అర్చకుడు

ఆత్మకూరు: మండల కేంద్రంలో కొలువుదీరిన అక్క దేవతల ఉత్సవాలు ఇటీవల ఘనంగా జరిగాయి. ఇందులో భాగంగా సోమవారం అక్క దేవతలకు నెల పూజను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఆలయంలో అక్క దేవతలకు ప్రత్యేకంగా పూలతో అలంకరించారు. అనంతరం విశేష పూజా కార్యక్రమాలు చేపట్టారు. భక్తులకు తీర్థ ప్రసాదాలను అందజేశారు.

చైతన్య పాఠశాలపై చర్యలకు డిమాండ్

కదిరి అర్బన్: నిబంధనలకు విరుద్ధంగా అడ్మిషన్లు, అధిక ఫీజుల వసూలు చేస్తున్న చైతన్య పాఠశాల యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలని ఏఐఎస్ఎఫ్ నాయకులు డిమాండ్ చేశారు. సోమవారం పట్టణంలోని చైతన్య పాఠశాల ఎదుట ధర్నా నిర్వహించారు. నాయకులు మాట్లాడుతూ స్కూళ్లు ప్రారంభం కాకనే మొబైల్ ఫోన్ల ద్వారా, ఇళ్ల వద్దకు వెళ్లి అడ్మిషన్లు చేస్తున్నారని, పుస్తకాలు, యూనిఫాం పేరిట అందినకాడికి దండుకుంటున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇంత జరుగుతున్నా విద్యాశాఖ అధికారులు పట్టించుకోకపోవడం దారుణమన్నారు. కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ నాయకులు మహేంద్ర, వినయ్, శశి, అరవింద్ తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరికి గాయాలు

కదిరి టౌన్: పట్టణంలోని ప్రభుత్వ ఆస్పత్రి సమీపంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకరికి గాయాలయ్యాయి. వివరాలిలా ఉన్నాయి. రహీమ్ అనే వ్యక్తి కదిరి నుంచి హిందూపురం వైపు ద్విచక్రవాహనంలో వెళ్తుండగా ప్రభుత్వాస్పత్రి సమీపంలో అదుపుతప్పి కిందపడ్డాడు. ఈ ప్రమాదంలో గాయపడిన రహీమ్‌ను ప్రభుత్వాస్పత్రికి తరలించారు.

జోరుగా పంట రుణాల రెన్యూవల్



కనగానపల్లి స్టేట్ బ్యాంకు వద్ద రుణాలు రెన్యూవల్ చేసుకునేందుకు వచ్చిన రైతులు

కనగానపల్లి: మండలంలోని పలు బ్యాంకుల్లో ఖరీఫ్ పంట రుణాల రెన్యూవల్స్ జోరుగా కొనసాగుతున్నాయి. మండల కేంద్రంలోని స్టేట్ బ్యాంక్, ఆంధ్రప్రగతి గ్రామీణ బ్యాంకులతో పాటు మామిళ్లపల్లిలోని గ్రామీణ బ్యాంకులో సుమారు 16 వేల మంది రైతులు ఏటా ఖరీఫ్‌లో పంట రుణాలు తీసుకుంటారు. కనగానపల్లి స్టేట్ బ్యాంకు, గ్రామీణ బ్యాంకుల వద్ద రైతుల రద్దీ కొనసాగుతోంది. జూన్ నెలాఖరులో పంట రుణాలు చేసుకోవాలని బ్యాంకు అధికారులు చెబుతుండటంతో రైతులు బ్యాంకులు వద్దకు భారీగా తరలి వస్తున్నారు. పాత రుణాల రెన్యూవల్‌తో పాటు కొత్త రుణాలు పొందే రైతులు కూడా బ్యాంకుల వద్దకు వస్తున్నారు. రైతులు తమ భూముల వన్‌బీ, అడంగల్ కాపీలు తీసుకునేందుకు మీ-సేవా కేంద్రాలు, రెవెన్యూ కార్యాలయాల వద్ద బారులు తీరుతున్నారు.

ఖాళీ సీట్లకు దరఖాస్తు చేసుకోండి

పుట్టపర్తి అర్బన్: జగరాజుపల్లి మోడల్ స్కూల్‌లో 7, 8, 9 తరగతుల్లోని ఖాళీ సీట్ల భర్తీకి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ రమేష్ బాబు ఓ ప్రకటనలో తెలిపారు. ఈ నెల 14వతేదీ లోపు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని, 15వ తేదీ ఉదయం 10 గంటలకు పాఠశాలకు వచ్చి ప్రవేశ పరీక్ష రాయాల్సి ఉంటుందని పేర్కొన్నారు. విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.

ఎమ్మార్సీలకు చేరిన పుస్తకాలు



తరగతుల వారీగా భద్రపరిచిన పాఠ్య పుస్తకాలు

పుట్టపర్తి అర్బన్: ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు అందజేసే ఉచిత పాఠ్య పుస్తకాలు, నోటు పుస్తకాలు పుట్టపర్తి ఎమ్మార్సీకి చేరాయి. 2024-25 విద్యా సంవత్సరానికి గాను మండలంలోని 42 ప్రాథమిక, 10 ఉన్నత పాఠశాలల్లో 5 వేల మందికి పైగా విద్యార్థులు ఉన్నారు. ఇప్పటి వరకూ రెండు విడతలుగా పాఠ్యపుస్తకాలు, నోటు పుస్తకాలు సరఫరా చేశారు. వాటిని భవిత కేంద్రంలో భద్రపరిచారు. రెండు విడతల్లోనూ 12,192 పాఠ్య పుస్తకాలు, 25,400 నోటు పుస్తకాలు వచ్చినట్లు ఎంఈఓ-2 ప్రసాద్ చెప్పారు. ఈ నెల 13వ తేదీన పాఠశాలల పునః ప్రారంభం సమయానికి ఆయా పాఠశాలలకు పుస్తకాలను పంపుతామన్నారు. వచ్చిన పుస్తకాన్నీ బైలింగ్యువల్ విధానంలో ముద్రించారు. ఇంగ్లిష్, తెలుగు మీడియం విద్యార్థులకు ఉపయోగ పడే విధంగా ఉన్నాయి. ఎమ్మార్సీ సిబ్బంది వాటిని తరగతుల వారీగా భద్రపరిచారు.

చెరువులు నిండేనా ?



నీరు లేక ఎండిపోయిన కట్టకిందపల్లి చెరువు



పోతుకుంట చెరువులో అరకొరగా ఉన్న నీరు

- వర్షాలు సమృద్ధిగా కురిస్తేనే సాగుపై ఆశలు

ధర్మవరం రూరల్: గత ఏడాది నిరాశ పర్చిన వర్షాలు.. ఈ ఏడాది సమృద్ధిగా కురిసి రైతులను కష్టాల నుంచి గట్టెక్కిస్తాయా అన్నది చర్చనీయాంశంగా మారింది. ధర్మవరం ప్రాంతంలో చెరువుల కింది ఆయకట్టు రైతులు బలమైన వర్షాల కోసం ఎదురుచూస్తున్నారు. గత ఐదేళ్లలో నాలుగేళ్లు సమృద్ధిగా వర్షాలు కురిశాయి. వాగులు, వంకలు, చెరువులు జలకళ సంతరించుకున్నాయి. గత ఏడాది ఆశించిన స్థాయిలో వర్షాలు కురవలేదు. ఈ ఏడాది ఇప్పటి వరకు బలమైన వర్షాలు కురవలేదు. దీంతో అనేక చెరువులు, కుంటలు, చెక్ డ్యాంలు నీరు లేక వెలవెలబోతున్నాయి. వీటి పరిధిలోని బోరుబావుల్లో భూగర్భజలాలు అడుగంటిపోయాయి. పశువులు, జీవాలకు సైతం నీటి ఇబ్బందులు ఎదురయ్యాయి. ఖరీఫ్-2024లో ముందస్తు వర్షాలు రైతుల్లో కాస్త ఆశలు చిగురింపజేశాయి. పూర్తిస్థాయిలో చెరువులు నిండేలా వర్షాలు వస్తే బోరు బావుల కింద వేరుశనగ, కూరగాయల పంటలు సాగు చేయాలని రైతులు భావిస్తున్నారు. మరి వరుణుడి కరుణ ఎలా ఉందో వేచి చూడాలి.

చెరువు	రావులచెరువు
చెరువు సామర్థ్యం	48.44 క్యూబిక్ మీటర్లు
నీటి నిల్వ	0.48 టీఎంసీలు
ఆయకట్టు	488 ఎకరాలు
భూగర్భ జలాలు పెరిగే గ్రామాలు	5

చెరువు	గొట్లూరు
చెరువు సామర్థ్యం	90.20 క్యూబిక్ మీటర్లు
నీటి నిల్వ	0.90 టీఎంసీలు
ఆయకట్టు	542 ఎకరాలు
భూగర్భ జలాలు పెరిగే గ్రామాలు	8

చెరువు	ధర్మవరం
చెరువు సామర్థ్యం	370.30 క్యూబిక్ మీటర్లు
నీటి నిల్వ	0.373 టీఎంసీలు
ఆయకట్టు	1,922 ఎకరాలు
భూగర్భ జలాలు పెరిగే గ్రామాలు	30

చెరువు	రేగాటిపల్లి
చెరువు సామర్థ్యం	40.45 క్యూబిక్ మీటర్లు
నీటి నిల్వ	0.40 టీఎంసీలు
ఆయకట్టు విస్తీర్ణం	135 ఎకరాలు

చెరువు	పోతుకుంట
చెరువు సామర్థ్యం	13.98 క్యూబిక్ మీటర్లు
నీటి నిల్వ	0.13 టీఎంసీలు
ఆయకట్టు విస్తీర్ణం	218 ఎకరాలు

అవసరం మేరకు విత్తన వేరుశనగ సిద్ధం



సమావేశంలో ప్రసంగిస్తున్న అధికారి

ఓడీచెరువు: రైతుల అవసరాల మేరకు సబ్సిడీ విత్తన వేరుశనగ సిద్ధంగా ఉందని మండల వ్యవసాయాధికారి (ఏఓ) ఇలియాజ్ తెలిపారు. సోమవారం మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో ఎంపీపీ తుమ్మల పర్వీన్‌భాను అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం జరిగింది. మండల వ్యవసాయ అధికారి మాట్లాడుతూ ఇప్పటి వరకు 4620 క్వింటాళ్ల విత్తన వేరుశనగ కాయలను పంపిణీ చేసినట్లు చెప్పారు. ఇంకా అవసరమైన మేరకు సరఫరా చేస్తామన్నారు. రిజిష్టర్ చేసుకున్న ప్రతి రైతుకూ నాణ్యమైన విత్తన వేరుశనగ కాయలు అందిస్తామన్నారు. చింతమానిపల్లి సర్పంచ్ జగన్‌మోహన్ చౌదరి మాట్లాడుతూ వేరుశనగ సాగుకు సిద్ధంగా ఉన్న రైతులకు అవసరమైన మేరకు ఎరువులు అందుబాటులో ఉంచాలని కోరారు. సమావేశంలో ఎంపీడీఓ వరలక్ష్మి, వైస్ ఎంపీపీ లక్ష్మీదేవి, ఎంపీటీసీ సభ్యులు, సర్పంచులు, అధికారులు పాల్గొన్నారు.

ఎస్పీకి ఉద్యోగుల సంఘం ధన్యవాదాలు



ఎస్పీ మాధవరెడ్డికి పుష్పగుచ్ఛం అందజేస్తున్న ప్రభుత్వ ఉద్యోగుల సంఘం నాయకులు

పుట్టపర్తి టౌన్: అవాంఛనీయ ఘటనలు జరగకుండా పటిష్ట బందోబస్తుతో సార్వత్రిక ఎన్నికలను విజయవంతంగా నిర్వహించిన ఎస్పీ మాధవరెడ్డికి ప్రభుత్వ ఉద్యోగుల సంఘం నాయకులు ధన్యవాదాలు తెలిపారు. సోమవారం పుట్టపర్తి ,కదిరి, తాలూకా కార్యవర్గం సభ్యులు ఎస్పీని చాంబర్‌లో కలిసి ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సార్వత్రిక ఎన్నికలు ప్రశాంతంగా ముగియడం అభినందనీయమన్నారు. అనంతరం ఎస్పీ మాధవరెడ్డి మాట్లాడుతూ ప్రజలు, ప్రభుత్వ ఉద్యోగులు, పోలీసులు, పాత్రికేయులు, రాజకీయ ప్రతినిధుల అందరి సమష్టి సహకారంతో ఎన్నికల ప్రక్రియను సమర్థవంతంగా నిర్వహించినట్లు వెల్లడించారు. కార్యక్రమంలో ప్రభుత్వ ఉద్యోగుల సంఘం జిల్లా అధక్షులు భాస్కర్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి రాజశేఖర్, పుట్టపర్తి తాలూకా అధ్యక్షులు లక్ష్మీనారాయణరెడ్డి, ప్రధానకార్యదర్శి రమణారెడ్డి, సహాయక అధ్యక్షులు ఫక్రోద్దీన్, మడకశిర తాలూకా అధ్యక్షులు భూతేగౌడ్, పెనుకొండ అధ్యక్షులు ఖాదర్ బాషాతోపాటు కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

పర్సా సత్యనారాయణ స్ఫూర్తితో ఉద్యమిస్తాం



సమావేశంలో మాట్లాడుతున్న నరసింగరావు

పుట్టపర్తి టౌన్: కార్మిక నేత, మార్క్సిస్టు పర్సా సత్యనారాయణ స్ఫూర్తితో కార్మిక హక్కుల సాధన కోసం ఉద్యమిస్తామని సీఐటీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నరసింగరావు పేర్కొన్నారు. సోమవారం పుట్టపర్తి పట్టణంలోని సాయి ఆరామం అతిథి గృహంలో శ్రామిక మహిళా సమాఖ్య అధ్యక్షురాలు దిల్షాద్ అధ్యక్షతన పర్సా సత్యనారాయణ జయంతి సందర్భంగా సమావేశం నిర్వహించారు. సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షులు ఓబులు, జిల్లా అధ్యక్షులు ఇంతియాజ్, జిల్లా ప్రధాన కార్యదర్శి ఈసీ వెంకటేశులు హాజరయ్యారు. రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నరసింగరావు మాట్లాడుతూ పర్సా సత్యనారాయణ 72 ఏళ్ల పాటు కార్మిక ఉద్యమాల్లో పాల్గొని.. తొమ్మిదేళ్ల జైలు జీవితం గడిపారన్నారు. ఆయన లాంటి ఎందరో నాయకుల త్యాగాల ఫలితంగా కార్మికులు తమ హక్కులను సాధించుకోగలిగారన్నారు. అయితే బీజేపీ సర్కారు ఆ హక్కులను హరిస్తూ లేబర్ కోడ్ తీసుకరావడానికి పన్నాగం పన్నుతోందన్నారు. పర్సా ఆశయాలను కొనసాగిస్తూ కార్మికుల హక్కుల కోసం ఉద్యమించాలని పిలుపునిచ్చారు. సమావేశంలో సీఐటీయూ నాయకులు నరసింహులు, రమేష్, బాబా, మున్సిపల్ వర్కర్ల యూనియన్ ప్రధాన కార్యదర్శి లక్ష్మీనారాయణ, అంగన్‌వాడీ జిల్లా అధ్యక్షురాలు శ్రీదేవి, ప్రధాన కార్యదర్శి లక్ష్మీదేవి, స్థానిక నాయకులు బ్యాళ్ల అంజి, పైపల్లి గంగాధర్, రామయ్య, గోవిందు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా వక్కలిగ మఠాధిపతి జన్మదిన వేడుకలు

రొళ్ల: కర్ణాటక రాష్ట్రం కొరటగెర తాలూకా ఎలెరాంపురం కుంచిటి వక్కలిగ సంస్థానం మఠాధిపతి హనుమంతనాథస్వామి జన్మదిన వేడుకలను సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా తాలూకా కుంచిటి వక్కలిగ సంఘం అధ్యక్షుడు, జెడ్పీటీసీ సభ్యుడు అనంతరాజు తదితరులు వేడుకల్లో పాల్గొని స్వామిజీకి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ ఏడాది వర్షాలు సమృద్ధిగా కురిసి రైతులు పంటలు బాగా పండాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు కొత్త పాళ్యం భోజేగౌడు, సీసీ గిరి కాంతరాజు తదితరులు పాల్గొన్నారు.

మధ్యాహ్న భోజన కార్మికులను కొనసాగించాలి



ఆర్ఐ నాగభూషణంకు వినతిపత్రం అందజేస్తున్న మధ్యాహ్న భోజన పథకం కార్మికులు, సీఐటీయూ నాయకులు

ఆత్మకూరు: జిల్లా వ్యాప్తంగా ప్రభుత్వ పాఠశాలల్లో పని చేస్తున్న మధ్యాహ్న భోజన పథకం కార్మికులను విధుల్లో కొనసాగించాలని సీఐటీయూ నాయకులు డిమాండ్ చేశారు. సోమవారం మండల కేంద్రంలోని తహసీల్దార్, ఎంపీడీఓ, ఎంఈఓ కార్యాలయాల వద్ద మధ్యాహ్న భోజన కార్మికులతో కలిసి అధికారులకు వినతిపత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. మధ్యాహ్న భోజనం కార్మికులు, శానిటేషన్ వర్కర్లను నైట్ వాచ్‌మెన్‌లను తొలగిస్తారని ఆందోళన చెందుతున్నారన్నారు. అతి తక్కువ వేతనాలతో పిల్లలకు భోజనం వండిపెడుతున్న వాళ్లను తొలగిస్తే కొత్తగా వచ్చే వారు నాణ్యతగా వంట వండలేరని తెలిపారు. నెలకు రూ.1,000 జీతం నుంచి శానిటేషన్ వర్కర్లు పని చేస్తున్నారన్నారు. నైట్ వాచ్‌మెన్లకు సంబంధించి వేతనాలు పెండింగ్‌లో ఉన్నా విధులు నిర్వహిస్తున్నారని గుర్తు చేశారు. పాఠశాలల్లో కనీస మౌలిక సదుపాయాలు కల్పించాలన్నారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షురాలు రమాదేవి, మండల కమిటీ అధ్యక్షురాలు జయమ్మ తదితరులు పాల్గొన్నారు.

34 మంది గర్భిణులకు హైరిస్క్



గర్భిణులకు భోజనం వడ్డిస్తున్న రోటరీ క్లబ్ సభ్యులు



వైద్య పరీక్షలు చేస్తున్న వైద్యాధికారి

ఓడీచెరువు : ప్రధాన మంత్రి సురక్షిత్ మాతృత్వ అభియాన్ కార్యక్రమంలో భాగంగా సోమవారం ఓడీచెరువు ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో గర్భిణులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. 70 మందిలో 34 మందిని హైరిస్క్ గర్భిణులుగా గుర్తించి, అత్యవసర చికిత్స కోసం సిఫార్సు చేశామని వైద్యాధికారి డాక్టర్ భానుప్రకాష్ తెలిపారు. ముందస్తు అవగాహనతో హైరిస్క్ పరిస్థితులను నివారించగలిగితే గర్భిణులు సాధారణ ప్రసవాలతో ఆరోగ్యవంతమైన శిశువులకు జన్మనివ్వవచ్చన్నారు. వైద్య పరీక్షలకు వచ్చిన గర్భిణులకు రోటరీ క్లబ్ వారు భోజన సౌకర్యం కల్పించారు.

గర్భిణులకు వైద్య పరీక్షలు

తలుపుల : మండల కేంద్రం తలుపుల ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో సోమవారం వైద్యాధికారులు అష్రాఫ్, ఆశ్రిత ఆధ్వర్యంలో గర్భిణులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. 77 మందిలో 11 మందికి రక్తహీనత ఉన్నట్లు గుర్తించారు. 14 మందిని అల్ట్రాసౌండ్ స్కానింగ్ నిమిత్తం కదిరి ఏరియా ఆసుపత్రికి రెఫర్ చేశారు. ప్రసవ సమయం వరకు గర్భిణులు తీసుకోవాల్సిన జాగ్రత్తలు, సూచనలను వైద్యులు వివరించారు. వైద్య పరీక్షలకు హాజరైన గర్భిణులకు గంగిశెట్టి పండ్లు, మజ్జిగ పంపిణీ చేశారు.

పండ్లతోటల పెంపకానికి దరఖాస్తుల ఆహ్వానం

రొళ్ల: ఉపాధి పథకం ద్వారా మెట్ట ప్రాంతాల్లో వివిధ రకాల పండ్ల మొక్కల పెంపకానికి రైతుల నుంచి ఇప్పటి దాకా 130 ఎకరాల వరకూ దరఖాస్తులు స్వీకరించినట్లు సోమవారం సాయంత్రం ఏపీఓ ఓబుళప్ప తెలిపారు. 2024-25 ఆర్థిక సంవత్సరంలో రొళ్ల మండలానికి 300 ఎకరాల్లో ఉపాధి ద్వారా మెట్ట ప్రాంతాల్లో పండ్ల తోటలు పెంపకానికి ఉన్నతాధికారుల నుంచి అనుమతి వచ్చిందన్నారు. దీంతో ఐదెకరాలలోపు మెట్ట ప్రాంతం భూములు కలిగిన సన్న, చిన్నకారు రైతులు దరఖాస్తులు చేసుకోవచ్చన్నారు. ఒక్కొక్క రైతుకు 3 ఎకరాల వరకూ అనుమతి ఇవ్వడం జరుగుతుందని పేర్కొన్నారు. మామిడి, కొబ్బరి, ఉసిరి, అల్లనేరేడు, జామ, సపోటతో పాటు చింత, పూల తోటలు సాగు చేసుకోవడానికి అవకాశం కల్పించడం జరిగిందన్నారు. అదేవిధంగా పండ్ల తోటలు మంజూరైన రైతులకు ఏడాదిలో 10 నెలల పాటు మూడేళ్ల పాటు మొక్కల సంరక్షణ కోసం ప్రతి నెలా బిల్లులు చెల్లించడం జరుగుతుందని వివరించారు. ఆసక్తిగల రైతులు రెవెన్యూ కార్యాలయంలో వీఆర్వోను కలసి స్మాల్ ఫార్మర్ సర్టిఫికేట్‌తో పాటు ఆధార్ కార్డు, పట్టదారు పాసుపుస్తకం, 1బీతో పాటు నాలుగు పాస్‌ఫోటోలను దరఖాస్తుకు జత చేసి ఎఫ్ఏలకు లేకపోతే మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో అయినా అందించవచ్చన్నారు. ఈనెలాఖరు వరకూ దరఖాస్తు చేసుకునేందుకు అవకాశం ఉందని, అర్హులైన రైతులందరూఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

న్యాయం జరిగే వరకూ పోరాటం



మాట్లాడుతున్న మాజీ ఎంపీ హర్షకుమార్

హిందూపురం: పట్టణానికి చెందిన న్యాయవాది సంపత్‌కుమార్ హత్యపై జ్యూడిషీయల్ దర్యాప్తు జరిపించాలని అమలాపురం మాజీ ఎంపీ హర్షకుమార్ డిమాండ్ చేశారు. సోమవారం హిందూపురం పట్టణానికి విచ్చేసిన ఆయన బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. తర్వాత సంపత్ సమాధి వద్దకు వెళ్లి నివాళులర్పించారు. అనంతరం ఆర్అండ్‌బీ అతిథి గృహంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. సంపత్‌కుమార్ కుటుంబానికి న్యాయం జరిగే వరకూ పోరాటం ఆపబోమన్నారు. దళిత న్యాయవాదిని ఇంత దారుణంగా, కిరాతకంగా నరికి చంపడం ఆటవీకమన్నారు. ఇంత దారుణం జరిగినా జిల్లా ఎస్పీ ఈ కేసు విషయంలో ఎలాంటి చర్యలు తీసుకోకపోవడం బాధకరమన్నారు. పోలీసు అధికారులు ఈ ఘటనపై అశ్రద్ధ చూపుతున్నారని విమర్శించారు. పోలీసు యంత్రాంగం వెంటనే స్పందించి నిందితులను పట్టుకొని కఠిన శిక్ష పడేలా చూడాలన్నారు. కార్యక్రమంలో ఎస్సీ, ఎస్టీ సంఘాల నాయకులు బీఎస్పీ శ్రీరాములు, ఎంఎస్ఎఫ్ఐ రవికుమార్, మడకశిర పాండు రంగమూర్తి, సోమన్న, బసవరాజు ఎంఎస్ మూర్తి, కేవీపీఎస్ నాయకులు రమణ నాగరాజు, టిప్పు సుల్తాన్ ముస్లిం నగరా నాయకులు ఉమర్ ఫరూక్, దళిత సంఘాల నాయకులు నారాయణ తదితరులు పాల్గొన్నారు.

చిన్నారులను అంగన్‌వాడీల్లో చేర్పించాలి

ఆత్మకూరు: మండల వ్యాప్తంగా ఉన్న 3 నుంచి 6 సంవత్సరాల్లోపు చిన్నారులను తప్పకుండా అంగన్‌వాడీ కేంద్రాల్లో చేర్పించాలని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ లావణ్య సూచించారు. సోమవారం మండలంలోని వడ్డుపల్లి గ్రామంలో అంగన్‌వాడీ కార్యకర్తలు ర్యాలీ నిర్వహించారు. మానవహారం చేపట్టి, ప్రతిజ్ఞ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. 3 సంవత్సరాలు పైబడిన పిల్లల్ని అంగన్‌వాడీ ప్రైమరీ పాఠశాలల్లో చేర్పించాలన్నారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో పూర్వ ప్రాథమిక విద్యతో పాటు రోజూ కోడిగుడ్డు, పాలు, భోజనం అందిస్తామని పేర్కొన్నారు. పిల్లలకు ఆటపాటలతో విద్యా బోధన చేస్తామన్నారు. పౌష్టికాహారంతో పిల్లల్లో మానసికంగా, శారీరక ఎదుగుదల ఉంటుందని తెలిపారు.

రన్నర్స్ జట్టుకు అభినందనలు

అనంతపురం ఎడ్యుకేషన్: విద్యాశాఖ నాన్ టీచింగ్ ఉద్యోగుల జోనల్ స్థాయి క్రికెట్ టోర్నీలో రన్నర్స్‌గా నిలిచిన ఉమ్మడి అనంతపురం జిల్లా జట్టు సభ్యులను జిల్లా విద్యాశాఖ అధికారి బి.వరలక్ష్మి సోమవారం అభినందించారు. జోనల్‌స్థాయి క్రికెట్ టోర్నీ ఈనెల 8, 9 తేదీల్లో కర్నూలులో జరిగింది. కడపపై గెలిచిన అనంతపురం, చిత్తూరుపై గెలిచి కర్నూలు జట్టు ఫైనల్‌లో తలపడ్డాయి. ఫైనల్ మ్యాచ్‌లో కర్నూలు జట్టు విజేతగా నిలిచింది. రన్నర్స్‌గా నిలిచిన అనంతపురం జట్టు సభ్యులను డీఈఓతో పాటు అసిస్టెంట్ డైరెక్టర్లు కృష్ణయ్య, నాగరాజు, సూపరింటెండెంట్లు అభినందించారు.

కాటికోటేశ్వర క్షేత్రంలో ప్రత్యేక పూజలు



పూజలందుకున్న కాటి కోటేశ్వరస్వామి

తాడిమర్రి: చిల్లవారిపల్లి సమీపంలోని కాటికోటేశ్వర క్షేత్రంలో సోమవారం భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. తొలుత పూజారి మూలవిరాట్‌కు వెండి ఆభరణాలు తొడిగి, పలు రకాల పుష్పమాలలతో అందంగా అలంకరించారు. భక్తులు ముందుగా గదా గుండంలో పుణ్యస్నానాలు ఆచరించి, ఆలయ ప్రదక్షిణలు చేశారు. అనంతరం స్వామికి కొబ్బరి కాయలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. అనంతరం భక్తులకు ఆలయ పూజారి తీర్థ ప్రసాదాలు పంపిణీ చేశారు.

కళామతల్లి సేవలో అంజినప్ప



తెలుగు బుక్ ఆఫ్ రికార్డ్స్ ప్రశంసాపత్రం అందుకుంటున్న ఉపాధ్యాయుడు అంజినప్ప

ధర్మవరం రూరల్: ఓ వైపు ఉపాధ్యాయ వృత్తి కొనసాగిస్తూనే.. మరోవైపు కళామతల్లి సేవలో ఎస్.అంజినప్ప తరిస్తున్నారు. 'కళాభిషేకం' కార్యక్రమం ద్వారా ఎంతోమంది కళాకారులను ప్రోత్సహిస్తున్నారు. ఆయన సేవలను గుర్తించిన తెలుగు బుక్ ఆఫ్ రికార్డ్స్ వారు ఇటీవలే విజయవాడలో ప్రశంసాపత్రం అందించి ఘనంగా సత్కరించింది. ఎస్.అంజినప్ప ధర్మవరం మండల పరిధిలోని పీసీఎంఆర్ పాఠశాలలో జీవశాస్త్ర ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్నారు. విద్యార్థులకు చక్కగా చదువు చెప్పడమే కాకుండా చిత్రకారునిగా, అభ్యుదయ భావాలతో సామాజిక చైతన్య గీతాలు రాసి, పాడడం, సాంస్కృతిక ప్రదర్శనలతో ఆకట్టుకుంటున్నారు. తేనె తెలుగు కల్చరల్ చారిటబుల్ ట్రస్ట్ ద్వారా పేద కళాకారులకు ఆర్థిక సాయం చేయడంతో పాటు గ్రామీణ ప్రాంతాలలో ఉండే కళాకారులను ప్రోత్సహిస్తున్నారు.

డిప్యూటీ తహసీల్దార్‌పై చర్యలు తీసుకోండి

సోమందేపల్లి: మహిళల పట్ల అసభ్యకరంగా ప్రవర్తించిన డిప్యూటీ తహసీల్దార్ శంకర్‌పై చర్యలు తీసుకోవాలని ఏపీ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు బాలస్వామి డిమాండ్ చేశారు. సర్వే నంబరు 700లో పేదలు వేసుకున్న గుడిసెలను తొలగిస్తామని రెవెన్యూ అధికారులు నోటీసులు అతికించడంపై తహసీల్దార్‌కు సోమవారం వినతిపత్రం ఇవ్వడానికి వచ్చామన్నారు. అయితే డిప్యూటీ తహసీల్దార్ ఏకవచనంతో మహిళలపై నోరు పారేసుకున్నారని ఆరోపించారు. ఉన్నతాధికారులు విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. అదేవిధంగా పేదల గుడిసెలు తొలగించకుండా చూడాలన్నారు. కార్యక్రమంలో ఇళ్ల స్థలాలు, భూసాధన కమిటీ సభ్యులు నూర్జహాన్, గుర్రమ్మ, అంజినమ్మ, రాములమ్మ తదితరులు పాల్గొన్నారు.

జేడీఎస్ ఖాతాలోకి 'పాల సంఘం'



నూతనంగా ఎన్నికైన పాల ఉత్పత్తి సహకార సంఘం సభ్యులు

పావగడ: తాలూకాలోని వదనకల్ గ్రామ పాల ఉత్పత్తి సహకార సంఘానికి సోమవారం ఎన్నికలు జరిగాయి. ఈ ఎన్నికల్లో జేడీఎస్ పార్టీకి చెందిన భాస్కరరెడ్డి అధ్యక్షుడిగా, విజయ నరసింహశాస్త్రి ఉపాధ్యక్షుడిగా ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. వారితో పాటు 9 మంది సభ్యులుగా ఎన్నికయ్యారు. ఈ ఎన్నికలో గెలుపొందిన నూతన అధ్యక్ష, ఉపాధ్యక్షులు, సభ్యులను స్థానిక మాజీ ఎమ్మెల్యే కేఎం తిమ్మరాయప్ప, జేడీఎస్ నాయకులు రాజగోపాల్, శివప్ప, మోహన్ సాసలకుంట, రాజప్పరెడ్డి, పాలయ్య, జయరామిరెడ్డి తదితరులు అభినందించారు.